నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి రద్దు

ఖిలావరంగల్, మే 26 : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో జిల్లా అధికార యంత్రాంగం నిమగ్నమైనందున సోమవారం గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఫిర్యాదులు నేడు కలెక్టరేట్‌కు రావొద్దని ఆమె కోరారు.

ఘనంగా నేషనల్ పైలట్స్ డే

వరంగల్, మే 26 : నేషనల్ పైలట్స్ డే వేడుకలను 108 సిబ్బంది ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణలో 108 ప్రాజెక్టు ఆఫీసర్ పాటి శివకుమార్ కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. హనుమకొండ, వరంగల్ జిల్లా మేనేజర్లు లక్ష్మణ్, రాము పాల్గొన్నారు. 108, 102 వాహనాల పైలట్లు మోడి సుమన్(వరంగల్), పాముల అర్జున్ వర్మ జిల్లా ఉత్తమ పైలట్లుగా ఎన్నిక కాగా, శివకుమార్ వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్

హనుమకొండ చౌరస్తా, మే 26 : నిరుద్యోగ యువత ఆర్థికంగా స్థిరపడుతూ ఇతరులకు ఉపాధి కల్పించాలనే ఆలోచనతో బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనియన్ కార్యాలయంలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పులి దేవేందర్ ముదిరాజ్ తెలిపారు. ట్రైనర్స్ వినోద్, శ్రీనివాస్, రాజమౌళి, శ్రీశైలం శ్రీనివాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'సమాచార హక్కుపై అవగాహన కల్పించాం'

హనుమకొండ చౌరస్తా, మే 26 : సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించేందుకు సమాచార హక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సదస్సులను నిర్వహించామని ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ బొమ్మ రబోయిన కేశవులు తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కోకన్వీనర్ గాడిపల్లి మధు, రాష్ట్ర కన్వీనర్ ఉషారాణి, దళిత బహుజన పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ దూడల సాంబయ్య, రామ్మూర్తి పాల్గొన్నారు.

పత్రిక ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింటు మ్యూధరబోయిన రవి, S/o. Late మల్లేశం గారి వ్యవసాయ భూమి Ac. 1-16 గుంటలు, సర్వే నెం. 204 నందు గలదు. వాటి హద్దులు:
తూర్పు: వ్యవసాయ భూమి రాజేందర్ గారిది,
పడమర: వ్యయసాయ భూమి రాజారాం గారిది,
ఉత్తరం: రెండు ఫీట్ల కేనాల్ కాలువా,
దక్షిణం: TNGO's Plots,

హద్దులు గల భూమి గత 30 సం.లుగా వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నారు. అట్టి భూమిపై మ్యూధరబోయిన గట్టయ్య, మ్యూధరబోయిన రాజారాం, మ్యూధరబోయిన అశోక్ గార్లు వచ్చి సదరు భూమి యొక్క హద్దులు చేసి ప్రయత్నం చేసి మరియు అక్రమంగా నా క్రయంటు భూమిలో చొరబడుటకు ప్రయత్నం చేసినారు. అందుకు గాను నా క్లయింటు O.S. No. 202 of 2024 గౌరవ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి నందు Injunction దావా వేసినారు. అదియు పెండింగ్‌లో ఉంది.

అట్టి దావా పెండింగ్‌లో ఉండగానే పై తెలిపిన రాజారాం, గట్టయ్య మరియు అశోక్ గార్లు వారి వారసులు రెవెన్యూ వాళ్లతో కుమ్మక్కై False Documents సృష్టించి, పై సర్వే నెంబర్‌ని పైగా చేసి 204/2, 0-24 గుంటల భూమి Physical గా లేని భూమిని రిజిస్ట్రేషన్ చేయుటకు ప్రయత్నం చేస్తున్నారని తెలిసింది.

అట్టి భూమిని నా క్లయింటు గారి హద్దులతో పోలుస్తు రిజిస్ట్రేషన్ చేయరదనినారు. ఈ రిజిస్ట్రేషన్ చెయ్యరాదు. చేసినచో చెల్లనేరదు. రిజిస్ట్రేషన్ చేసినచో చట్టరీత్యా చర్యలు తీసుకొనబడును.

Sd/- **PORIKA UTHAM KUMAR,** ADVOCATE,
2-5-730, Near Old Employment Office, Subedari, Hanumakonda.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED HOSPITAL STAFF

jobs Apply Now!

★డయాలసిస్ టెక్నీషియన్స్, OT- టెక్నీషియన్స్, ఫార్మసీ బాయ్స్ మరియు GNM నర్సులు అనుభవం గలవారు కావలెను. సంప్ర: గ్లోరియన్ హాస్పిటల్, ములుగు 'X' రోడ్, వరంగల్. 12 to 2pm.
NTW-0383

HOUSE FOR SALE

★WGL, కొత్తవాడ, లక్ష్మీ గార్డెన్స్ దగ్గర 182 గ.ల.E/F ఇల్లు G.F 1BHK+2BHK, 1st ఫ్లోర్ 2BHK+2BHK, 2nd Floor, 1BHK పార్కింగ్ G.F. కార్ @3 Bikes,1బోర్, WMC వాటర్. సంప్ర|| 9490421153, 9652979107
KMM_11663

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556
9182777557 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 MAHABUBABAD
9182777554 JANGAON
9182777565

ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో చేరుకున్న సిబ్బంది
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్

వరంగల్ కలెక్టరేట్‌లో పోలింగ్ సామగ్రిని పంపిణీ చేస్తున్న జిల్లా అధికారులు

పర్వతగిరిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్

వరంగల్, మే 26 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఆదివారం కాకతీయ డిగ్రీ కళాశాల లోని ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. బ్యాలెట్ బాక్స్‌లు, బ్యాలెట్ పేపర్‌లను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పంపిణీ చేసి, ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీవో, ఏపీవోలు ఎన్నికల సంఘం నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఎన్నికల సంఘం ఇచ్చిన వాయిలెట్ రంగు పెన్నులతోనే బ్యాలెట్ పేపర్‌పై మార్క్ చేయాలన్నారు. ఏఆర్‌వోలతో కలిసి బ్యాలెట్ బ్యాక్స్‌లు, ఇతర సామగ్రిని నల్లగొండలోని స్ట్రాంగ్ రూమ్‌కు పోలీసు భద్రతా సిబ్బంది మధ్య చేరవేస్తామని చెప్పారు. పోలింగ్‌లో పొరపాట్లు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

హనుమకొండలో 67 పోలింగ్ కేంద్రాలు..

హనుమకొండ జిల్లాలో 67 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సిక్తా పట్నాయక్ తెలిపారు. జిల్లాలో 43,729 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని, వీరిలో 25,739 మంది పురుషులు, 17,990 మంది మహిళా ఓటర్లని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీవోలు నారాయణ, వెంకటేశ్, డీఈవో అబ్దుల్ హై పాల్గొన్నారు.

వరంగల్ జిల్లాలో 59 పోలింగ్ కేంద్రాలు

వరంగల్(నమస్తేతెలంగాణ): ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అధికారులు వరంగల్ జిల్లాలో సకల ఏర్పాట్లు చేశారు. పోలింగ్ అధికారులు, సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో 59 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 23 లొకేషన్లలో ఉన్న ఈ పోలింగ్ కేంద్రాలను 11 రూట్లుగా విభజించారు. ఈ ఎన్నిక కోసం పీవోలు 71, ఏపీవోలు 71, ఓపీవోలు 142, మైక్రో అబ్జర్వర్లు 71, సెక్టోరల్ అధికారులు 11 మందిని నియమించారు. బ్యాలెట్ పద్ధతిన పోలింగ్ జరుగనుంది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. కలెక్టరేట్‌లో 8 డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఆదివారం పోలింగ్ అధికారులు, సిబ్బందికి ఎన్నికల సామగ్రిని పంపిణీ చేయగా వారు జిల్లాలోని 59 పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని, పేపర్ బ్యాలెట్ ఓటింగ్ విధానం అర్థమయ్యే రీతిలో ఓటర్లకు వివరించాలని ఆమె పోలింగ్ సిబ్బందికి చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వీల్‌చైర్లను అందుబాటులో ఉంచామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత మెటీరియల్ కలెక్టర్ కార్యాలయంలో చెక్ లిస్ట్ ప్రకారం అందజేయాలని సూచించారు. పశు సంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ, జడ్పీ సీఈవో రామిరెడ్డి, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, తహసీల్దార్లు విశ్వనారాయణ, రమేశ్, మంజుల, ఇక్బాల్, విజయ సాగర్, రియజొద్దీన్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం సందర్శన

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : పర్వతగిరిలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెన్నారావుపేటలోని ప్రభుత్వ పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మండలవ్యాప్తంగా 1697 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు అధికారులు తెలిపారు. నెక్కొండలో 2146 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారని తహసీల్దార్ రాజ్‌కుమార్, సెక్టార్ అధికారి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సంగెం మండలంలో 2,576 మంది ఓటు హక్కును వినియోగించుకోనుండగా ఏర్పాట్లను తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్, ఎస్సై నరేశ్ పర్యవేక్షించారు. అలాగే, గీసుగొండ మండలంలో 865 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తహసీల్దార్ రియాజుద్దీన్ తెలిపారు. దామెర ప్రభుత్వ పాఠశాలలో 1,331 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి తెలిపారు.

4న కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ సిక్తాపట్నాయక్

హనుమకొండ చౌరస్తా, మే 26 : జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఆదివారం సాయంత్రం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌంటింగ్ హాల్, టేబుళ్లు తదితర కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, వెంకట్‌రెడ్డి, పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల ఏఆర్వోలు నారాయణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద సూచనలిస్తున్న కలెక్టర్

ఎంజీఎంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాశీబుగ్గ, మే 26: ఎంజీఎం దవాఖానలో గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ తుమ్మ గోపి తెలిపారు. ఈ నెల 7న సుమారు 50 ఏళ్ల వయసుగల వ్యక్తి కాలుకు గాయంతో ఎంజీఎం దవాఖానలో చేరాడు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యులు అవుట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించగా, వారు మట్టెవాడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సంబంధీకులు ఉంటే 8712685090, 8712685005, 8712685117 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

చెట్టును ఢీకొట్టిన కారు.. ఇద్దరికి గాయాలు

కమలాపూర్, మే 26 : మండలంలోని ఉప్పల్ పెద్ద చెరువు మత్తడి సమీపంలో ప్రమాదవశాత్తు చెట్టుకు కారు ఢీ కొనడంతో పెద్దోజు అనిల్, ఎగ్గోజు రమణాచారికి తీవ్ర గాయాలైనట్లు ఆదివారం గ్రామస్తులు తెలిపారు. కన్నూరు గ్రామానికి చెందిన అనిల్, రమణాచారి కారులో ఉప్పల్ వైపు వస్తుండగా పెద్ద చెరువు మత్తడి సమీపంలో మలుపు వద్ద అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. దీంతో వారికి గాయాలు కాగా, చికిత్స కోసం వరంగల్‌కు తరలించారు.

భారీగా మద్యం పట్టివేత

ఖిలావరంగల్/గిర్మాజీపేట, మే 26: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాకరాశికుంటలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు భారీగా మద్యం పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్ రవికుమార్ కథనం ప్రకారం.. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ సాకరాశికుంటకు చెందిన ఎనగందుల సృజన(30) తన ఇంట్లో మద్యం విక్రయిస్తున్నది. విశ్వాసనీయ సమాచారం మేరకు తనిఖీలు చేయగా రూ. 1,95,450 విలువైన మద్యం లభించింది. స్వాధీనం చేసుకొని మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై శరత్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ అశోక్, అంజయ్య, పాషా, సాంరాజును సీపీ అభినందించారు. అలాగే, కాశీబుగ్గలో అంగిడి కరుణ, తేజావత్ శారద మద్యం విక్రయిస్తుండగా రూ. 38,500 విలువైన బాటిళ్లను పట్టుకున్నట్లు ఇంతెజార్ గంజ్ సీఐ మచ్చ శివకుమార్ తెలిపారు.

ప్రియుడి ఇంటి ఎదుట యువతి ధర్నా

ధర్నా చేస్తున్న యువతి

చెన్నారావుపేట, మే 26: ప్రేమించి పెళ్లికి నిరాకరిస్తున్న ప్రియుడి ఇంటి ఎదుట ఓ యువతి ధర్నా చేసిన ఘటన మండలకేంద్రంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. దొంతి రుచిత(23), అదే గ్రామానికి చెందిన మజ్జిక అన్వేశ్ ఎనిమిదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లిమాట ఎత్తేసరికి అన్వేశ్ తప్పించుకుంటున్నాడు. పెద్ద మనుషుల సమక్షంలో పెళ్లికి ఒప్పుకొని ఇప్పుడు మూడు నెలల సమయం కావాలంటూ దాటవేస్తున్నాడని ఆమె ఆరోపించింది. కాగా, మహిళా సంఘం నాయకులు యువతికి మద్దతు తెలిపారు.

గొల్లపల్లెలో యువతి అదృశ్యం

నల్లబెల్లి, మే 26: యువతి అదృశ్యమైన ఘటన గొల్లపల్లెలో జరిగింది. గ్రామానికి చెందిన పనికర సారయ్య కూతురు మమత ఈ నెల 20న నర్సంపేటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం ఆమె తండ్రి సారయ్య ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

మృతుడి కటుంబానికి ఆర్థిక సాయం

చెన్నారావుపేట, మే 26 : మండలకేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ దుడ్డె శోభన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబానికి ఆటో యూనియన్ నాయకుడు గుర్రపు భిక్షపతి ఆధ్వర్యంలో ఆదివారం రూ. 30 వేల ఆర్థిక సాయం అందించారు. అలాగే, ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఎదుబోయిన వీరమల్లు కుటుంబ సభ్యులకు రూ.10 వేలు అందించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు బండారి సత్యం, నాంపల్లి సత్యం, ముదురుకోళ్ల భిక్షపతి, ఎండీ బాషా, సుంకరి రాంప్రసాద్, జంగిలి సదయ్య పాల్గొన్నారు.

భద్రాచలానికి పాదయాత్ర

నెక్కొండ, మే 26: దీక్షకుంటకు చెందిన హనుమాన్ మాలధారులు భద్రాచలం సీతారామచంద్రస్వామి దర్శనానికి ఆదివారం పాదయాత్ర చేపట్టారు. గ్రామంలో ఇరుముడి కట్టుకున్న మాలధారులు దీక్షా విరమణను భద్రాచలంలో చేసేందుకు కాలినడకన బయల్దేరి వెళ్లారు. పాదయాత్రలో కోలా ప్రవీణ్, అక్కినపల్లి వెంకటస్వామి, అక్కినపల్లి సిద్ధార్థ, కూస సాంబనర్సయ్య, మడుసు ప్రేమాకర్, సిద్దు, శివాజీ, దొణికెన రమేశ్, తోట దుర్గయ్య, ముడుసు ప్రశాంత్, దనియాల కన్నయ్య, మహేశ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, మే 26 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తర తెలంగాణలోని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లోని 6 నుంచి 14 ఏళ్ల లోపు బధిర విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు కరీంనగర్‌లోని ప్రభుత్వ బధిరుల పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని, వివరాలకు 9000013639, 9000221301, 9666868755 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫాతిమా బ్రిడ్జిపై రెండు కార్లు ఢీ

- ఇద్దరికి తీవ్రగాయాలు.. దవాఖానకు తరలింపు..
- అర గంటకు పైగా ట్రాఫిక్ జాం

బ్రిడ్జిపై ఎదురెదురుగా ఢీ కొట్టుకున్న రెండు కార్లు

కాజీపేట, మే 26 : కాజీపేట పట్టణంలోని ఫాతిమా బ్రిడ్జిపై ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయిన కారు ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టిన ఘటన ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట నుంచి హనుమకొండకు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. దీంతో రెండు కార్ల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ఇద్దరికి తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకోగా, స్థానికులు వైద్య చికిత్స కోసం దవాఖానకు తరలించారు. ఈ ఘటనతో దాదాపు అరగంటకు పైగా ట్రాఫిక్ స్తంభించింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని బ్రిడ్జి పైనుంచి రెండు కార్లును కిందికి దింపి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ప్రమాదంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

కలెక్టర్ ఆదేశాలను ధిక్కరించిన కేయూ మాజీ వీసీ, రిజిస్ట్రార్ మల్లారెడ్డి

హనుమకొండ చౌరస్తా, మే 26 : వారం రోజుల క్రితం ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఓ రాజకీయ పార్టీ అభ్యర్థిని కలిసిన కేయూ ఒప్పంద అధ్యాపకులైన లక్ష్మారెడ్డి, ఆర్‌డీ ప్రసాద్, శ్రీధర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎలక్షన్ అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ కేయూ రిజిస్ట్రార్, మాజీ వీసీలకు ఆదేశాలు జారీ చేశారు. అయినా చర్యలు తీసుకోకపోవడంతో ఫిర్యాదుదారుడు శైలేంద్ర తెలంగాణ ఎలక్షన్ అధికారి వికాస్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి మళ్లీ ఇటీవల కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డికి, మాజీ వీసీ రమేశ్‌కు ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకొని పూర్తి నివేదిక పంపాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా, వీసీ లేకపోవడం వల్ల నిర్ణయం తీసుకోవడం లేదని రిజిస్ట్రార్ కలెక్టర్‌కు సమాచారం పంపారని, మాజీ వీసీ 22న ఉద్యోగ విరమణ చేశారని, రిజిస్ట్రార్ మల్లారెడ్డి కావాలనే జాప్యం చేసినట్లు శైలేంద్ర ఆరోపించారు. కలెక్టర్ ఉత్తర్వులను ఉల్లంఘించిన రిజిస్ట్రార్‌పై కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, జిల్లా ఎన్నికల అధికారికి శనివారం ఫిర్యాదు చేసినట్లు శైలేంద్ర తెలిపారు.

ఉత్తమ ఏఈగా రవికుమార్ ఎంపిక

బహుమతిని అందుకుంటున్న రవికుమార్

ఆత్మకూరు, మే 26 : విద్యుత్ ఉత్తమ ఏఈగా రవికుమార్ ఎంపికైనట్లు ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జి ఆపరేషన్స్ డైరెక్టర్ మోహన్‌రావు ఆదివారం తెలిపారు. వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు ఇంజినీర్లు, ఉద్యోగుల పనితీరు మెరుగు పర్చేందుకు 'బెస్ట్ ఫర్మామెన్స్ ఆఫ్ ద మంత్' పేరుతో బహుమతులను ఇస్తున్నామన్నారు. రవికుమార్‌కు హనుమకొండ డీఈ సాంబరెడ్డి, ఏడీఈ మల్లికార్జున్, కడిపికొండ ఏఈ జగదీశ్వర్‌రెడ్డి బహుమతి అందజేశారు.

శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలి

ఖానాపురం, మే 26: గ్రామీణ క్రీడాకారులు వేసవి శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి సత్యవాణి అన్నారు. అశోక్‌నగర్‌లో నెల రోజులుగా కొనసాగుతున్న అథ్లెటిక్స్, అయోధ్యనగర్‌లో కొనసాగుతున్న వాలీబాల్ శిక్షణ శిబిరాలను ఆదివారం ఆమె సందర్శించారు. శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కబడ్డీ కోచ్ యాట రవికుమార్, శేఖర్, రాజేశ్ పాల్గొన్నారు.

శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో సత్యవాణి

కళాకారులకు ప్రశాంసపత్రాలు అందజేస్తున్న ప్రతినిధులు

ప్రాచీన నృత్య కళలను కాపాడుకోవాలి

కాజీపేట, మే 26 : దేశంలోని ప్రాచీన నృత్య కళలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రైల్వే సీనియర్ డీఈఈ ప్రశాంత కృష్ణసాయి అన్నారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో ఓరుగల్లు నృత్యోత్సవం-2024, ఆల్ ఇండియా డాన్స్ ఫెస్టివల్ ఆదివారం ముగిసింది. ప్రతిభ కనబర్చిన కళాకారులకు మెమెంటో, ప్రశంసా పత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో రైల్వే డబ్ల్యూడబ్ల్యూవో అధ్యక్షురాలు దీపిక, నృత్య టీచర్లు భ్రమరాంబ, కళాశారద పాల్గొన్నారు.

వైభవంగా మత్స్యగిరి స్వామి నాగవెల్లి మహోత్సవం

శాయంపేట, మే 26 : శాయంపేటలోని మత్స్యగిరి స్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి నాగవెల్లి నిర్వహించారు. స్వామివారికి విశ్వక్సేన ఆరాధన, స్వస్తి పుణ్యాహవచనం, 12 రకాల పుష్పాలతో యాగాన్ని అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచారి, యాగ్నికుడు వీరవల్లి వేణుగోపాలాచార్యులు నిర్వహించారు. మత్స్యగిరి స్వామి శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ఆలయం చుట్టూ 12 ప్రదక్షిణలు చేశారు. ఆలయ చైర్మన్ సామల భిక్షపతి, జిన్నా ప్రతాప్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేస్తున్న గోక కుమారస్వామి

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

సంగెం, మే 26 : సంగెంలో వేసవి పదో తరగతి ఉచిత శిక్షణ శిబిరం మార్గం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్నది. 10వ తరగతి పేద విద్యార్థులకు రూ. 25వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను ఆదివారం గోక కుమారస్వామి అందజేశారు. కార్యక్రమంలో బొజ్జ సురేశ్, సింగారపు బాబు, ముసుకుంట్ల కోటేశ్వర్, కుమారస్వామి, నర్సింగరావు, కరుణశ్రీ, కుమార్, యాదగిరి పాల్గొన్నారు.

ఏకశిలా పార్కులో రక్తదానం చేస్తున్న సభ్యులు

రక్తదానం చేయడం సామాజిక బాధ్యత

న్యూశాయంపేట, మే 26 : ఏకశిలా పార్క్ వాకర్స్ అసోసియేషన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని ఏకశిలా పార్క్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ గవర్నర్ ఎల్లాగౌడ్, అధ్యక్షుడు వంగ రాజిరెడ్డి, సెక్రటరీ పడాల సోమయ్య, పీఆర్వో వేల్పుల సారంగపాణి మాట్లాడుతూ ఒకరు రక్తదానం చేయడం వల్ల ముగ్గురి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. 50 మందికిపైగా వాకర్స్ రక్తదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు దశరథరాంరెడ్డి, సహాయ కార్యదర్శి వీరస్వామి, రవీందర్ యాదవ్, ఉపాధ్యక్షుడ